2వ పాఠం జనవరి 1-7

# హెబ్రీయులకు వ్రాసిన పత్రిక యొక్క వర్తమానము

**సబ్బాతు మధ్యాహ్నము** **జనవరి 1**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : హెబ్రీ 1:5-14; లూకా 1:30-33; కీర్తన 132:1-5; హెబ్రీ 2:14-16; 5:1-4; 8:8-12; 1పేతురు 2:9.**

**కంఠతవచనం : "మేము వివరించుచున్న సంగతులలోని సారాంశమేదనగా, మనకు అట్టి ప్రధాన యాజకుడు ఒకడున్నాడు" హెబ్రీ 8:1.**

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక అనంతరము కొన్ని దశాబ్దముల తరువాత, సుమారు క్రీ။శ။ 100లో ఒక ప్రార్ధన వ్రాయబడి యున్న యూదయ పత్రిక కనుగొనబడెను. అందులో "ఓ ప్రభువా, నీవు ఈ లోకమును మా కొరకు సృష్టించావని తెలుసుకొని నీ ముందు ఇదంతయు మాట్లాడితిని, ఇప్పుడు ఈ దేశములను చూడు ప్రభువా, వాటి విలువ శూన్యమైనను, మీ మీద అవి అధికారమును చూపించుచు మమ్ములను మ్రింగివేయుచున్నవి. అయితే నీ ప్రజలమైన మేము నీకు ప్రియమైనవారము. నీకు మొదట పుట్టిన వారము, నీ కొరకు ఉత్సాహము గలవారము. వారి చేతులకు అప్పగించబడితిమి" –జేమ్సు హబ్, చార్లెస్ వర్తు, ది ఓల్డ్ టెస్టమెంట్ సూడిపిగ్రుఫ సంపుటి 1, (పిబాడీ, ఎమ్ఎ; హెంద్రిక్ సన్ పబ్లిషర్సు 1983) పుట 536.

హెబ్రీ విశ్వాసులు కూడా ఆ విధముగానే బాధపడి యుంటారు. వారు దేవుని బిడ్డలైన యెడల అటువంటి శ్రమలను ఎందుకు ఎదుర్కొనుచున్నారు?

శ్రమలను ఎదుర్కొనుచున్న విశ్వాసులను బలపర్చుటకుగాను పౌలు హెబ్రీ పత్రికను వ్రాసాడు. ఇప్పుడు తండ్రి కుడి పార్శ్వమున కూర్చొని యున్న యేసు త్వరలో వచ్చి మనలను ఆయన సిద్ధపరచిన గృహమునకు తీసుకొని వెళ్ళును. మరియు దేవుడు చేసిన వాగ్దానములను యేసు ద్వారా నెరవేర్చబోవుచున్నాడని వారికి (మనకు) పౌలు గుర్తు చేస్తున్నాడు. తండ్రియొక్క దీవెనలు మన మీదకు వచ్చునట్లు యేసు మధ్యవర్తిత్వము వహించును. అందుచేత చివరి వరకు మన విశ్వాసమును కాపాడుకొనవలసియున్నది.

–జనవరి 8, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **జనవరి 2**

## మన రాజైన యేసు

హెబ్రీ పత్రిక యొక్క ప్రధానాంశము : యేసు మన ప్రభువైయున్నాడు. మరియు పరిపాలకుడు. ఆయన తండ్రియొక్క కుడి పార్శ్వమున ఆసీనుడైయున్నాడు (హెబ్రీ 8:1). దేవుడుగా యేసు ఎల్లప్పుడు విశ్వమునకు ప్రభువుగానే ఉన్నాడు. అయితే ఆదామవ్వలు పాపము చేసినందున

సాతానుడు ఈ లోకాధికారి అయ్యాడు (యోహాను 12:31; 14:30; 16:11) యేసు వచ్చి సిలువ యొద్ద సాతానును ఓడించి ఎవరైతే యేసును వారి రక్షకునిగా అంగీకరిస్తారో వారిపై అధికారమును తిరిగి పొందెను. (కొలస్స 2:13-15).

హెబ్రీ పత్రిక యొక్క మొదటి రెండు అధ్యాయములు యేసును రాజుగా నియమించిన విషయాలను చర్చించియున్నది.

**హెబ్రి 1:5-14 చదువుడి. ఇక్కడ ఏమి జరుగుచున్నది?**

ఈ వాక్యాలు మూడు విభాగాలుగా అమర్చబడినవి. ఒక్కొక్క విభాగము కుమారుని సింహాసనమెక్కించే కార్యమును పరిచయము చేస్తాయి. ముందుగా దేవుడు యేసును రాజకుమారునిగా ప్రవేశపెడుతున్నాడు (హెబ్రీ 1:5). రెండవదిగా తన కుమారుని పరలోకములో ఎవరైతే ఆరాధిస్తారో ఆ సభకు దేవుడు పరిచయము చేస్తాడు (హెబ్రీ 1:6,8). అదే సమయములో కుమారుని యొక్క అధికారమును మరియు లోకమంతటిని సృష్టించిన సృష్టికర్తగా దేవుడు ప్రకటిస్తాడు. (హెబ్రీ 1:8-12). మూడవదిగా దేవుడు తన కుమారుడిని సింహాసనము మీద కూర్చోబెట్టి భూమి మీద అధికారమునంతటిని అప్పగిస్తాడు (హెబ్రీ 1:13,14).

దేవుడు దావీదుకు చేసిన వాగ్దానము యేసునందు నెరవేరినదని నూతన నిబంధన విశ్వాస సూత్రాలలో ఒక ప్రాముఖ్యమైన సూత్రముగా నమ్మడమైనది (2సమూ. 7:8-16; లూకా 1:30-33 చూడుడి). దావీదు పురమునందు దావీదు వంశావళిలో యేసు జన్మించెను (మత్త 1:1-16; లూకా 2:10,11) యేసు తాను చేసిన సేవా కాలములో ఆయనను “దావీదు కుమారుడా” అని ప్రజలు తరచుగా పిలిచేవారు. “యూదులకు రాజు” అని యేసు ప్రకటించుకున్నాడనే నేరారోపణ క్రింద ఆయనను సిలువ వేసారు (మత్తయి 27:37). దావీదుకు చేసిన వాగ్దానము యొక్క నెరవేర్పుగా యేసు మరణమునుండి లేచెనని పేతురు మరియు పౌలు బోధించారు (అపో.కా.2:22-36; 13:22-37). “యూదా గోత్రపు సింహముగా” యేసును యోహాను గుర్తించాడు (ప్రకటన 5:5)

హెబ్రీ పత్రిక కూడా ఆ అభిప్రాయముతో ఏకీభవించుచున్నది. దేవుడు దావీదుకు చేసిన వాగ్దానములు యేసునందు నెరవేరినవి. దేవుడు ఆయనకు శ్రేష్టమైన ఒక నామమును అనుగ్రహించెను (హెబ్రీ 1:4). తన సొంత కుమారునిగా ఆయనను నిలువబెట్టెను (హెబ్రి 1:5). ఎప్పటికి యేసే సృష్టికర్త మరియు ప్రభువైయున్నాడని రూఢి పరచెను (హెబ్రి 1:8-12) దేవుడాయనను తన కుడిపార్శ్వమున కూర్చుండబెట్టుకొనెను (హెబ్రి 1:13,14) హెబ్రి 4 ప్రకారము యేసు ప్రజలను దేవుని విశ్రాంతిలోనికి నడిపిస్తాడు మరియు దేవుని ఇంటిని నిర్మించాడని గుర్తు చేస్తున్నాడు (హెబ్రీ 3:3,4).

యేసు ఈ లోకమునకు న్యాయ సమ్మతమైన పరిపాలకుడు, అన్యాయముగా అధికారము కొరకు మన విధేయత కొరకు పోరాడువాడైన సాతానుతో యుద్ధములో ఉన్నాడు.

**ఈ విశ్వమునకు యేసు రాజు అని తెలుసుకొనుట ద్వారా మనము ఎదుర్కొనే శ్రమలలో ఏవిధముగా ఆదరణ పొందగలము?**

సోమవారం జనవరి 3

# మన మధ్యవర్తియైన యేసు

పాతనిబంధన వేదాంత శాస్త్రము ప్రకారము వాగ్దానము చేయబడిన దావీదు వంశావళి నుండి వచ్చిన రాజు దేవుని యెదుట తన ప్రజలకు (దేశమునకు) ప్రతినిధిగా ఉంటాడు అనే ఆసక్తికరమైన ఒక భావము ఏర్పడినది.

**నిర్గమ 4:22, 23ను 2సమూ 7:12-14తోను, ద్వితియో 12:8-10ని 2 సమూ 7:9-11తోను, ద్వితియో 12:13,14ను కీర్తన 132:1-5, 11-14తో పోల్చి చూడుడి. వాగ్దానము చేయబడిన దావీదు వంశావళి నుండి వచ్చే రాజు ద్వారా ఇశ్రాయేలుకు చేయబడిన ఏ వాగ్దానములు నెరవేరును?**

ఇశ్రాయేలు దేవుని కుమారుడైయున్నాడు. శత్రువుల నుండి ఇశ్రాయేలీయులు విశ్రాంతి పొందుటకు వారికి దేవుడు ఒక స్థలమును అనుగ్రహిస్తాడు. దేవుడే ఒక స్థలమును ఎంచుకొని అక్కడే ఆయన నామము స్తుతించబడును, మరియు అదే దేవుని నామమునకు నివాస స్థలమైయుండును. వాగ్దానము చేయబడిన దావీదు వంశములోని రాజు ద్వారా దేవుడు ఇశ్రాయేలుకు చేసిన వాగ్దానములు నెరవేరును. అతడు దేవుని కుమారుడుగా దత్తు చేసుకొనబడును. తన శత్రువులనుండి అతనికి దేవుడు విశ్రాంతిని అనుగ్రహించును. మరియు అతడు సియోనులో దేవునికి ఒక మందిరమును నిర్మించును. అక్కడ దేవుని నామము నివాసము చేయును. అనగా వాగ్దానము చేయబడిన దావీదు వంశావళికి చెందిన రాజు ద్వారా దేవుడు ఇశ్రాయేలుకు చేసిన వాగ్దానములు నెరవేరును.

దేవునికి మరియు ఇశ్రాయేలుకు మధ్యన ఉన్న బాంధవ్యములో ఒక ప్రతినిధిని ఏర్పాటు చేయుట ద్వారా నిబంధన బాంధవ్యము తరతరములు లేక శాశ్వతముగా నిలిచి యుండుననుటకు నిదర్శనము. మోషే నిబంధనలో దేవుని యొక్క కాపుదల మరియు దీవెనలు పొందుటకు ఇశ్రాయేలు తన విశ్వాస్యతను నిరూపించుకొనవలసి యున్నది (యెహో. 7:1-13) అయితే దావీదు నిబంధనలో ఇశ్రాయేలు మీద దేవుని యొక్క నిబంధన దీవెనలు దావీదు వంశావళికి చెందిన రాజు యొక్క విశ్వాసత్యను బట్టి అనుగ్రహించబడును.

అయితే దావీదు వంశావళికి చెందిన రాజులలో ఎక్కువమంది విశ్వాసులుగా లేకపోవుట వలన దేవుడు అనుకున్నట్లు ఇశ్రాయేలును దీవించలేదు. పాతనిబంధనలో అవిశ్వాసులైన ఇశ్రాయేలు రాజులను గురించి ఎన్నో విషయాలను తెలుసుకొనవచ్చును.

అయితే శుభవార్త ఏమిటంటే దేవుడు తన ఏకైక కుమారుని దావీదు కుమారుడుగా జన్మించుటకు పంపించెను. అతడు అన్ని విషయాలలో పరిపూర్ణమైన విశ్వాసమును కనుపర్చెను. అందుచేత ఆయనను బట్టి దేవుడు తన ప్రజలకు చేసిన వాగ్దానములను నెరవేర్చగలిగెను. దేవుడు రాజును ఆశ్వీరదించినపుడు ఆ రాజు యొక్క ప్రజలందరు ఆ మేలులను పంచుకుంటారు. అందువలననే మనకు దేవుడనుగ్రహించు దీవెనలకు యేసు మధ్యవర్తియాయెను. ఆయన ఒక మార్గముగా ఏర్పడుట ద్వారా దేవుని యొక్క దీవెనలు ఆ మార్గముగుండా ప్రవహిస్తాయి.

మన చివరి నిరీక్షణయైన రక్షణకు సంబంధించి యేసు మనకు చేసిన దానిని బట్టి ఆయన ద్వారా మాత్రమే మనకు రక్షణ లభించును.

**నీ తరపున నీవు చేసుకొనిన నిబంధనకు ఎన్నిసార్లు నీవు అవిశ్వాసముగా ప్రవర్తించావో ఒకసారి ఆలోచించుకో. దీనిని బట్టి మన రక్షణ కొరకు మనం కేవలము యేసు మీదనే ఆధారపడవలసియున్నదని ఇది మనకు ఏమి బోధించుచున్నది?**

## మంగళవారం జనవరి 4

## మన వీరుడైన యేసు

**1సమూ 8:19,20; హెబ్రీ 2:14-16 పోల్చి చూడుడి. ఒక రాజులో ఇశ్రాయేలీయులు దేని కొరకు చూచేవారు? వారు కోరుకున్నవి యేసునందు ఏవిధంగా నెరవేరెను?**

ఇశ్రాయేలీయులకు దేవుడే రాజైయున్నాడు అనే విషయాన్ని వారు మరచిపోవుట వలన రాజులో ఒక న్యాయాధిపతిని మరియు అతడు యుద్ధములో నాయకుడైయుండాలని వారు కోరుకున్నారు. తన ప్రజలపై దేవుని యొక్క పూర్తి పరిపాలన యేసు ద్వారా మాత్రమే పూర్వస్థితికి తీసుకొని రాబడినది. యేసు మన దేవుడుగా, మన శత్రువుకు వ్యతిరేకముగా మనలను యుద్ధములో నడిపిస్తాడు.

బలహీనులైన మానవులకు యేసు ఒక వీరుడుగా హెబ్రీ 2:14-16లో పరిచయము చేయబడెను. క్రీస్తు ఒంటరిగానే సాతానుతో యుద్ధములో పాల్గొని అతనిని ఓడించి మనలను సాతాను యొక్క బంధకముల నుండి విమోచించును. ఈ వివరణ, దావీదు మరియు గొల్యాతు మధ్య జరిగిన యుద్ధము మనకు జ్ఞాపకము చేస్తుంది. రాజుగా అభిషేకించబడిన తరువాత (1సమూ 16) దావీదు గొల్యాతు మీద విజయము సాధించుట ద్వారా తన సహోదరులను బానిసత్వము నుండి విమోచించగలిగెను. వారిరువురి మధ్య యుద్ధము జరగకముందు ఆ పోరాటములో ఎవరు ఓడిపోతే వారు, విజయము సాధించిన వర్గాలకు బానిసలుగా పనిచేయాలనే ఒప్పందమును చేసుకున్నారు (1సమూ 17:8-10) ఆ విధముగా దావీదు ఇశ్రాయేలీయులకు వీరుడుగా ప్రాతినిధ్యము వహించి, గొల్యాతును సంహరించి ఇశ్రాయేలీయులను బానిసత్వములోనికి వెళ్ళకుండా సహాయపడెను.

**యెషయ 42:13; యెషయా 59:15-20 చదువుడి. ఈ వాక్యాలలో యావెహ్ తనను గూర్చి ఏవిధముగా వర్ణించుకొనెను?**

దేవుడు ఒంటరిగా పోరాడి ఇశ్రాయేలును కాపాడుననే అభిప్రాయమును హెబ్రీ 2:14-16 ఉదాహరిస్తుంది. యెషయా గ్రంథములోని ఈ వాక్యమును చదవండి.

“యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు - బలాఢ్యులు చెరపట్టినవారు సహితము విడిపింపబడుదురు. భీకరులు చెరపట్టిన వారు విడిపింపబడుదురు. నీతో యుద్ధము చేయు వారితో నేనే యుద్ధము చేసెదను. నీ పిల్లలను నేనే రక్షించెదను” యెషయా 49:25.

క్రైస్తవులముగా మనము సాతానుతో ఒంటరిపోరాటములో పాల్గొనుచున్నామని తరచూ

భావిస్తూ ఉంటాము. మనము ఎఫెసి 6:10-18ని చదివినపుడు, సాతానుతో మనము పోరాడుచున్నాము అని అర్థమవుతుంది. అయితే దేవుడు మన శూరుడు. మనకు ముందు ఆయన యుద్ధమునకు వెళ్ళును. మనమాయన సైన్యములో భాగమైయున్నాము. అందువలననే ఆయన యుద్ధ కవచమును ధరించుకొనవలసియున్నాము. ఒంటరిగా మనము పోరాడుట లేదు. ఎఫెసి 6లో "నీవు" అనే పదము బహు వచనమైయున్నది. మన మొక సంఘముగా యుద్ధ కవచమును ధరించి మన యుద్ధ వీరుడైన దేవుని వెనకే ఉండి అందరము కలిసిపోరాడవలసియున్నాము.

**దేవుని యొక్క యుద్ధ కవచమును ధరించుకొనుట అనగా అర్థమేమిటి? అనగా మన అనుదిన జీవితములో స్వప్రయోజనము కొరకు జరిగే పోరాటములోను, శోధనలు ఎదురైనపుడు వాటిని ఎదుర్కొనుటకు విశ్వాసులకు లభించే శక్తి ఎట్లు ఉపయోగించుకొనగలము?**

**బుధవారం** **జనవరి 5**

## మన ప్రధాన యాజకుడైన యేసు

యేసు యొక్క రెండవ కర్తవ్యమును గూర్చి హెబ్రి 5-7లో పరిచయము చేయబడెను. ఆయన మన ప్రధాన యాజకుడైయున్నాడు. దావీదు వంశావళి నుండి వచ్చిన రాజు ద్వారా దేవుడు చేసిన వాగ్దానము నెరవేరియున్నదని గ్రంథకర్త వివరించుచున్నాడు. ఆ రాజును గూర్చి దేవుడు ఈ విధముగా చెప్పియున్నాడు "నీవు మెల్కీసెదెకు క్రమము చొప్పున నిరంతరము యాజకుడవైయున్నావు" (కీర్తన 110:14ను హెబ్రీ 5:5,6లో ఉదహరించెను).

**లేవికాండము 1:1-9; లేవి 10:8-11; మలాకీ 2:7; సంఖ్యా 6:22-26; హెబ్రీ 5:1-4 చదువుడి యాజకుడు నిర్వహించే విధులు ఏమిటి?**

మానవులకు ప్రతినిధులుగా యాజకులు నియమింపబడును. దేవునికి సంబంధించిన విషయాలను గూర్చి దేవునితో మానవునికున్న బాంధవ్యమును గూర్చి మధ్యవర్తిత్వము చేస్తాడు. యాజకుడు ఒక మధ్యవర్తియైయున్నాడు. యూదయ, గ్రీకు, రోమా లేక ఇతర మతాలకు చెందిన యాజకత్వ విధానములో ఇది నిజము. మనము దేవునితో సంబంధము కలిగి యుండుటకు సాధ్యమయ్యే విధముగా యాజకుడు తన విధులను నిర్వహిస్తాడు.

మానవుల పక్షమున యాజకుడు దేవునికి బలియర్పణలు లేక ఇతర అర్పణలు చేస్తాడు. వ్యక్తిగతముగా ఈ అర్పణలను ప్రజలు దేవుని యొద్దకు తీసుకొని రాలేరు. ఏవిధముగా మనము దేవునికి ఒక ఆమోదయోగ్యమైన అర్పణను అర్పించాలో యాజకునికి తెలుసు మరియు ఆ అర్పణ మనకు క్షమాపణ అనుగ్రహించుటకు లేక శుద్ధీకరణ పొందుటకు అనుకూలమైనదా లేదా అనే విషయము యాజకునికి అర్థమవుతుంది.

యాజకులు ప్రజలకు దేవుని యొక్క ధర్మశాస్త్రమును కూడా బోధిస్తారు. దేవుని యొక్క ఆజ్ఞలను వివరించుటలోను వాటిని ప్రజలకు అనువర్తించుటలోను వారు నిపుణులు.

చివరగా 'యావెహ్' నామములో దీవెనలను ఇచ్చే బాధ్యత యాజకులు కలిగియున్నారు. వారి ద్వారా దేవుడు తన చిత్తమును మరియు ప్రజలయెడల ఆయన కలిగియున్న లక్ష్యములను మధ్యవర్తిత్వము చేయుట ద్వారా నెరవేర్చుకుంటాడు.

అయితే 1పేతురు 2:9లో వేరొక విషయాన్ని చూస్తున్నాము. యేసునందు విశ్వాసులమైన మనము "రాజులైన యాజక సమూహము" అని పిలువబడితిమి. ఈ పాత్ర నమ్మశక్యముగాని విశేషాధికారములను సూచించుచున్నది. పరిశుద్ధ మందిరములో యాజకులు దేవునిని సమీపించగలరు. నేడు మనము ప్రార్ధన ద్వారా నమ్మకముతో లేక ధైర్యముగా దేవుని సన్నిధికి వెళ్ళగలము (హెబ్రీ 4:14-16; 10:19-23) అదే సమయములో కొన్ని ప్రాముఖ్యమైన బాధ్యతలు కూడా వున్నవి. లోకమును రక్షించే పనిలో మనము దేవునితో మరియు ధర్మ సూత్రములను మనము వివరించి బోధించవలసియున్నాము. ఆయనకు సంతోషమును కలిగించే రీతిలో మంచి క్రియలను మరియు స్తుతియాగమును మనము చేయాలని ఆయన కోరుచున్నాడు. ఇది ఎంత చక్కటి ఆధిక్యత మరియు బాధ్యతయైయుంది.

**మనము రాజులైన ఒక యాజక సమూహము అని పిలువబడుట వలన అది మన జీవితములో ఎట్టి మార్పును కలిగియుండాలని సూచిస్తుంది? ఏవిధముగా జీవించాలనే విషయాన్ని ఈ సత్యము ఎట్లు ప్రభావితం చేస్తుంది?**

గురువారం జనవరి 6

## ఒక శ్రేష్టమైన నిబంధనకు యేసు మధ్యవర్తిత్వము వహించుచున్నాడు

ఒక నూతన నిబంధనకు యేసు మధ్యవర్తిగా పనిచేయుచున్నాడనే విషయము మీద హెబ్రీ 8-10 చర్చిస్తున్నది. భవిష్యత్తు కాలములో సంభవించబోవు మంచి విషయాలను ముందుగా కనబరచుటయే పాతనిబంధన యొక్క ధ్యేయమైయున్నది. భవిష్యత్తులో యేసు నిర్వహించబోవు కార్యములను ముందుగా తెలియజేయుటకు పాతనిబంధన వ్యవస్థలు రూపొందించబడినవి. ఆ విధముగా యేసు నిర్వహించుచున్న యాజక విధులను మరణము తప్పని, పాపులైన ఆనాటి యాజకులు సాదృశ్యముగా నిర్వహించారు. యేసు ఆ సేవను పరిపూర్ణముగా అందించినట్లు వారు అందించలేకపోయారు. మరియు ఆనాటి యాజకులు పరలోక సంబంధమగు వస్తువుల ఛాయా రూపకమైన గుడారమునందు సేవ చేసియున్నారు (హెబ్రీ 8:5).

యేసు నిజమైన గుడారములో సేవ చేయుచు, దేవుని యొద్దకు మనకు ప్రవేశము లభించునట్లు ఏర్పాటు చేసి పెట్టెను. మన పక్షమున యేసు చేసిన బలియర్పణకు మరియు మరణమునకు సాదృశ్యముగా జంతువులు బలిగా అర్పింపబడినవి. అయితే వాటి రక్తము మన మనస్సాక్షిని శుద్ధీకరించలేకపోయినది. అయితే యేసు రక్తము మన మనస్సాక్షిని పరిశుద్ధపరచి ఆయనయందున్న మన విశ్వాసమును బట్టి మరియు మన పక్షమున ఆయన చేయుచున్న మధ్యవర్తిత్వ సేవను బట్టి ఆయన ద్వారా ధైర్యముతో మనము దేవుని సన్నిధికి చేరగలము. (హెబ్రీ 10:19-22).

**హెబ్రీ 8:8-12 చదువుడి. క్రొత్తనిబంధనలో మనకు దేవుడు చేసిన వాగ్దానము ఏమిటి?**

యేసును మన ప్రధాన యాజకునిగా నియమించుట ద్వారా తండ్రియైన దేవుడు ఒక క్రొత్తనిబంధనను స్థాపించి దాని ద్వారా పాతనిబంధన దేనినైతే ముందుగా తెలుసుకొని ఎదురుచూచినదో దానిని నెరవేర్చుటకు సహాయపడినది. ఒక పరిపూర్ణమైన, శాశ్వతమైన, మానవ దైవ యాజకుడు దేనినైతే అందించగలడో దానిని క్రొత్తనిబంధన అనుగ్రహించెను. ఈ ప్రధాన యాజకుడు దేవుని ఆజ్ఞలను బోధించుటయే గాక వాటిని మన హృదయాలలో నాటును. ఈ యాజకుడు అర్పించిన బలియర్పణ పాపక్షమాపణను అనుగ్రహించును. ఈ యాజకుడు మనలను పరిశుద్దపరచి మార్పు చేయును. ఆయన మన రాతి హృదయములను మాంసపు హృదయములుగా మార్పు చేయును. (యెహెజ్కేలు 36:26) ఆయన నిజముగా మనలను నూతన సృష్టిగా చేయును (2కొరింథి 5:17) తండ్రి సన్నిధికి మనకు ప్రవేశమును కలుగజేయును.

భవిష్యత్తులో సంభవించే విషయాలను ముందుగా చూపించుట కొరకు దేవుడు పాతనిబంధనను రూపొందించెను. దానియొక్క అవసరములోను మరియు లక్ష్యములోను అది సుందరముగా రూపొందించబడినది. అయితే దానియొక్క లక్షణమును కొందరు తప్పుగా గ్రహించారు. చిహ్నములు మరియు ఛాయలను విడిచిపెట్టి, అవి ఏ సత్యములను సూచించుచున్నవో వాటిని స్వీకరించుటకు ఇష్టపడక ఆ చిహ్నములను ఛాయలనే అంటిపెట్టుకొని యేసు యొక్క పరిచర్య ద్వారా కలిగే ఆశ్చర్యకరమైన మేళ్ళను వారు పోగొట్టుకున్నారు.

"గుడారమునకు క్రీస్తు పునాది మరియు జీవమునైయున్నాడు. దాని సేవలు దేవుని కుమారుడు చేసిన బలియర్పణకు మాదిరిగా ఉన్నవి. క్రీస్తు చేసే మధ్యవర్తిత్వపు సేవలను సూచించుటకు యాజకత్వపు సేవలను నియమించెను. రక్షకుని యొక్క మరణము ద్వారా లోకమును విమోచించుట సాధ్యమని ముందుగా చూపించుటకొరకు సమర్పణ ఆరాధన ప్రణాళిక అంతయు రూపొందించబడినది. ఒక గొప్ప కార్యమును సూచించుటకు ఏర్పాటు చేయబడిన బలియర్పణల విధానము, ఆ కార్యము నెరవేరినప్పుడు అది నిరర్ధకమగును" -ఎలెన్ జి వైట్, యుగయుగాల ఆకాంక్ష, పుట 165.

**శుక్రవారం** **జనవరి 7**

## అదనపు అధ్యయనము

హెబ్రీ పత్రికలో పేర్కొనబడిన మంచి విషయాలు, ఆశాజనకమైన సత్యములతో పాటు కొన్ని వరుస హెచ్చరికలు కూడా ఆ గ్రంథములోని 10-12లో కలవు.

ఈ విభాగములలో కనీసం రెండు విషయాలు ఒకే విధంగా ఉన్నాయి. మొదటగా అవి హెబ్రీ విశ్వాసులు అరణ్యములో సంచరించిన తరము వారితో పోల్చబడిరి. రెండవదిగా, విశ్వాసము కలిగియుండుడి అని హెచ్చరించుచున్నవి.

ఐగుప్తు దేశము నుండి ఆశ్చర్యకరమైన రీతిలో దేవుని యొక్క మహా శక్తితో ఇశ్రాయేలు జనాంగములోని ఆ తరము వారు సూచనలు మరియు అద్భుత కార్యముల మధ్య విమోచింపబడిరి. పది ఆజ్ఞలను వినిపిస్తూ సీనాయి పర్వతము నుండి దేవుడు మాట్లాడగా వారు ఆ స్వరమును వినిరి. రాత్రి సమయములో అగ్నిస్తంభమును మరియు పగటి పూట వారిని మేఘము కాపాడుట చూచితిరి. పరలోకము నుండి పంపబడిన ఆహారమైన మన్నాను వారు భోజనము చేసిరి. ఎక్కడ బస చేసినా అక్కడ బండలలో నుండి ఉబికిన నీటిని త్రాగిరి. అయితే వారు వాగ్దానభూమి యొక్క సరిహద్దులకు వచ్చిన తరువాత దేవునిని నమ్మలేకపోయారు. దేవుడు కోరిన విశ్వాసము వారిలో కొదువుగా ఉన్నది. "విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము" (హెబ్రి 11:6).

అరణ్యములో సంచరించిన అప్పటి తరము వారివలెనె మనము కూడా వాగ్దాన భూమి యొక్క సరిహద్దులలో ఉన్నాము (హెబ్రి 10:37-39)అయితే అప్పటి ప్రజలకంటే మనకు లభించే ఆధికత్యలు, మనము నిర్వహించే బాధ్యతలు గొప్పవే. అయితే సీనాయి పర్వతము యొద్ద మాట్లాడిన దేవునికి సమానుడైన దేవునిని అనగా శరీరధారియైన యేసుక్రీస్తును, పరిశుద్ధ లేఖనములు మనకు బయలుపర్చగా చూసితిమి (హెబ్రి 12:18-24) అయితే మనకు విశ్వాసమున్నదా అనునది ప్రశ్న. యేసుతో అంతమయ్యే అనేకులు ఇతరుల మాదిరిని అనుసరించమని పౌలు మనలను ప్రోత్సహించుచున్నాడు.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. సాతానుకు వ్యతిరేకముగా పోరాడుటకు మనకన్నా ముందు వెళ్ళి నిలుచుటకు మన శూరుడైన యేసు మనకున్నాడని నేర్చుకొనియున్నాము. మన శూరుడు వెనుక ఆయనను వెంబడిస్తూ ఒక సంఘముగా అందరము ఏవిధముగా పోరాడగలము? ఆవిధముగా జరగకుండా ఏ విషయాలు మన ఐకమత్యమును చెడగొట్టుచున్నవి? ఏ మార్గాలను అనుసరించి సంఘముగా మనలను సాతానుడు బలహీనపర్చు చున్నాడు? గత కాలములో ఇశ్రాయేలీయులను సాతానుడు ఏ విధముగా బలహీపర్చాడు?
2. దేవుని నడుపుదల క్రింద ఒక సమాజముగా మనమందరము యాజక సమూహమైయున్నాము. మీ ప్రాంతీయ సంఘము దేవునికి స్తుతియాగము చేయుటతో పాటు మంచిక్రియలను చేయుటకు ఏ మార్గాలను అనుసరించాలి? ఆచరణాత్మకముగా ఉండు ప్రత్యేక మార్గములను సూచించండి.
3. వాగ్దాన భూమిలోనికి ప్రవేశించుటకు ముందు అరణ్యములో సంచరించిన జనాంగము ఎదుర్కొన్నపరిస్థితి వంటిది మనకేవిధంగా ఎదురవుచున్నది? ఈ రెండింటి మధ్యనున్న పోలికల నుండి ఏ గుణపాఠములను నేర్చుకొనగలము?

❋✶❋